
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 6 మార్చి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.145	215	244
సూర్యాపేట	రూ.155	220	250
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 24.2

ప్రైవేట్ భవనాల్లో ఇంకెన్నాళ్లు





- కోట్ల రెవెన్యూ ఉన్నా సొంత భవనాలు కరువు
- ఉమ్మడి రాష్ట్రంలో కోదాడ, మోత్కూరు, నకిరేకల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకే భవనాలు
- సౌకర్యాలు లేక దెబ్బతింటున్న డాక్యుమెంట్లు
- ఇది 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల దుస్థితి

ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్న రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఆయా కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఏటా ప్రభుత్వానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లతో సుమారు రూ.300 నుంచి రూ.400 కోట్ల ఆదాయం సమకూరుతోంది. అయినా సొంత భవనాలు కరువయ్యాయి. - నల్లగొండ



అధికారులు పలుమార్లు నివేదికలు సమర్పించినా స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన రాష్ట్ర శాఖ అధికారులు భవన నిర్మాణాల ఫైల్‌ను పెండింగ్‌లో పెడుతున్నారు. దీంతో సొంత భవనాలు కలగానే మిగిలిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదనేది అర్థం కాని పరిస్థితి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష సందర్భంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు లేవని తెలుసుకొని, ఆ పరిస్థితి ఎందుకు వచ్చిందని అధికారులను ఆరా తీశారు. వెంటనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎక్కడెక్కడ ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీగా ఉన్నాయనేది అధికారులు వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

నల్లగొండలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం సమకూర్చాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రభుత్వం కూడా త్వరలో సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయి. సొంత భవనం ఏర్పాటైతే ఆస్తుల క్రయవిక్రయదారులకు సౌకర్యాలు మెరుగుపడతాయి. ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన వెంటనే నల్లగొండలో సొంతభవనాన్ని నిర్మిస్తాం.

- కోమటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్, నల్లగొండ.

ప్రభుత్వం దృష్టిలో ఉంది

గత ప్రభుత్వం హయాంలోనే జిల్లా అధికారులు సొంత భవనాలకు సంబంధించి నివేదికలు పంపించారు. ప్రస్తుత ప్రభుత్వం త్వరలోనే నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. గతంలో కలెక్టరేట్‌లో ఖాళీగా ఉన్న కార్యాలయంలోకి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించాలని సూచించారు.

- ఎస్.ప్రకాష్, ఉమ్మడి నల్లగొండ జిల్లా రిజిస్ట్రార్

ఉమ్మడి రాష్ట్రంలో మూడు కార్యాలయాలకే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నల్లగొండ జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేలా నిధులు కేటాయించారు. మొత్తం 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా కోదాడ, మోత్కూరు, నకిరేకల్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను రూ.64లక్షలతో సొంత భవనాలు నిర్మించారు. ఆ తరువాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి హోంమంత్రి, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి మహమూద్ అలీకి కూడా నివేదికలు సమర్పించినప్పటికీ నిధులు మంజూరుకాలేదు. ఆయన కొన్నినెలల క్రితం గత ప్రభుత్వ హయాంలో నల్లగొండలో పర్యటన సందర్భంగా కూడా భవన నిర్మాణాల గురించి పరిశీలిస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి కార్యాలయాలు తరలించాలని చెప్పడమే తప్ప సొంత భవనాల నిర్మాణాల కోసం నిర్ణయం తీసుకోలేదు. నల్లగొండ విషయానికి వస్తే కలెక్టరేట్‌లో కొన్ని కార్యాలయాలు ఖాళీగా ఉన్నట్టు సమాచారం. ఆ భవనాల్లోకి కేవలం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్నే తరలించేందుకు వీలుంటుంది. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం కేవలం అడ్మినిస్ట్రేషన్‌కే పరిమితమైతే తరలించవచ్చు. అయితే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రజలతో అనుబంధంగా ఉంటున్నందున తరలించేందుకు వీలుపడటం లేదు.

ప్రైవేట్ కార్యాలయాల్లో సౌకర్యాలు కొరత

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట, యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. దీంతో అరకొర సౌకర్యాలు నడుమనే అధికారులు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇక ఆస్తులు క్రయ విక్రయదారులకు సౌకర్యాలు ఉండటంలేదు. వాష్ రూమ్ సౌకర్యాలతో పాటు మంచినీటి సౌకర్యం లేకపోవడం ఫర్నిచర్ లేకపోవడం కూర్చోవడానికి కనీసం కుర్చీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ సంబంధించిన అధికారులు ఉన్న పరిస్థితులతోనే నెట్టుకుపోతున్నారు. ఇకపోతే కార్యాలయాల్లో పాత డాక్యుమెంట్లకు రక్షణ కరువైంది. గత 70 ఏళ్లకు పైగా పైబడి ఉన్న ఉర్దూ తెలుగు డాక్యుమెంట్లు కూడా ఉన్నాయి. గతంలో పాత డాక్యుమెంట్లను ఆన్‌లైన్ చేయిస్తామని అప్పటి ప్రభుత్వాలు చెప్పినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. పాత డాక్యుమెంట్లు చినిగిపోయే పరిస్థితి ఉంది. ఎంతో విలువైన ఉర్దూ డాక్యుమెంట్లు ఉన్నా పట్టించుకునే పరిస్థితి లేదు. ఉర్దూ డాక్యుమెంట్లను తెలుగులోకి అనువదించి వాటిని ఆన్‌లైన్‌లో భద్రపరచాలని గతంలో నిర్ణయించినా అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వానికి రెవెన్యూ పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడం లేదనేది విమర్శలకు తావిస్తోంది.

గొర్రెల స్కాంలో అధికారులకు బిగుస్తున్న ఉచ్చు



- ఇప్పటికే చంచల్‌గూడ జైలులో వయోజన విద్య డీడీ
- డిప్యూటేషన్‌పై వెళ్లి గొర్రెలను కొనుగోలు చేసిన అధికారులు
- ఏసీబీ విచారణలో పలు విషయాలు వెలుగులోకి
- కలెక్టరేట్‌లో ఫైళ్ల క్లియరెన్స్ ఇక కష్టతరమే

నల్లగొండ, మార్చి 5: గొర్రెల స్కాంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో పాటు జిల్లా పశుసంవర్థక శాఖలో పాత్రధారులైన అధికారులకు ఉచ్చు బిగుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గొర్రెల కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపు విషయంలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో రైతు నుంచి 10నుంచి 12యూనిట్ల గొర్రెలు మాత్రమే కొనుగోలు చేయాలి. కానీ, నల్లగొండలో మాత్రం అందుకు విరుద్ధంగా దళారుల నుంచి పెద్ద మొత్తంలో యూనిట్లను కొనుగోలు చేసిన అధికారులు చిక్కుల్లో పడ్డారు. రాష్ట్రస్థాయిలో ఒక కీలకమైన ప్రజాప్రతినిధితో పాటు ఓ ఉన్నతాధికారి సూచనతో ఈ అవినీతికి తెరతీసినట్టు సమాచారం. కొద్ది రోజుల క్రితం ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన నలుగురు అధికారుల్లో నల్లగొండ వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేష్ కూడా ఉన్నారు. అరెస్టు తరువాత ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించడమే గాక, ఆయన స్థానంలో యాదాద్రి జిల్లాకు చెందిన ఓ అధికారికి డీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీనికి తోడు వయోజన విద్యలో కీలకమైన సెక్షన్ పనులను నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతికి కేటాయించారు. ఇక ఏసీబీ అధికారులు మూడు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించగా, నల్లగొండకు చెందిన వయోజన విద్య అధికారి గణేష్ పలు కీలకమైన అంశాలు ఏసీబీ అధికారులకు చెప్పినట్టు వినికిడి. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో ఉన్నారు.

డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారులపైనా విచారణ?

గత ప్రభుత్వం గొర్రెల కొనుగోళ్ల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు పశుసంవర్థక శాఖ అధికారులతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులకు సైతం బాధ్యతలు అప్పగించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు నల్లగొండ జిల్లాలోని వివిధ కీలకమైన శాఖలకు చెందిన ఉన్నతాధికారులు గొర్రెల కొనుగోళ్లలో ప్రధాన పాత్ర పోషించారు. అందులో పలువురు దళారుల వద్దే గొర్రెలను సేకరించే విషయంలో ఉత్సాహం చూపినట్టు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. నల్లగొండ జిల్లాలో 1,066 యూనిట్ల ఫైలు ప్రకారం సుమారు రూ.15కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అందులో రూ.12కోట్ల మేర దళారులకే చెల్లించాల్సి రావడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయాన్ని అప్పటి నల్లగొండ జిల్లా కలెక్టర్ కర్ణన్ పరిశీలించి ఫైల్‌ను పక్కన పెట్టారు. అదేవిధంగా ప్రస్తుత కలెక్టర్ హరిచందన సైతం ఫైల్‌ను స్టడీ చేయాల్సి ఉందని పశుసంవర్థకశాఖ అధికారులకు స్పష్టం చేశారు. ఆ ఫైల్‌తోపాటు జరిగిన పొరపాట్లను, అక్రమాలను, అవినీతిని గ్రహించినట్టు విశ్వసనీయ సమాచారం. ఇక ఆ ఫైల్‌కు మోక్షం కలిగే ప్రసక్తి లేదని పశుసంవర్థక శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. వారిని కూడా త్వరలోనే ఏసీబీ అధికారులు విచారించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. వారందరినీ విచారిస్తే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో తేలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫైల్ పెండింగ్ విషయంపై పశుసంవర్థకశాఖ జేడీ సుబ్బారావును పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఫైల్ కలెక్టరేట్‌లోనే పెండింగ్‌లో ఉందని స్పష్టం చేస్తున్నారు. అయితే ఆ ఫైల్‌లో ఉన్న అంశాల గురించి మాత్రం తనకు తెలియదని చెబుతున్నారు. ప్రధానంగా నల్లగొండ జిల్లాలో 1,172 నకిలీ ఇన్‌వాయిస్‌లకు చెల్లింపులు చేసినట్టు కాగ్ నివేదికలో వెల్లడించింది. మొత్తానికి వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేష్ అరెస్టు కావడం జైలుకు వెళ్లడంతో పాటు ఇటీవల ఏసీబీ అధికారుల కస్టడీలో ఎలాంటి విషయం వెల్లడించారనే దానిపై జిల్లా అధికారుల్లో భయాందోళన మొదలైంది.

వినియోగదారుల కోసం ప్రజాపాలన సేవా కేంద్రాలు

విద్యుత్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఏఎం రిజ్వీ



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

నల్లగొండ టౌన్, మార్చి 5: ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల్లో ఎల్‌పీజీ, విద్యుత్ వినియోగదారుల వివరాలను సరి చేసేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఏఎం.రిజ్వీ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీల అమలులో భాగంగా ఇటీవల గృహ జ్యోతి పథకానికి, అలాగే ఎల్‌పీజీ సిలిండర్‌కు సంబంధించి గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ వినియోగదారుల యూఎస్సీ నెంబర్లను సరి చేయడం, నంబర్లను తిరిగి సేకరించేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ వార్డుల్లో వీటిని ఏర్పాటు చేసి సమాచారాన్ని సేకరించాలన్నారు. ఈ కేంద్రాల్లో వివరాలు అందజేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పౌరసరఫరాల కమిషనర్ డీఎస్.చౌహాన్,ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్‌అలీ, సీజీజీ డీజీ రాజేంద్రనిమ్జే తదితరులు మాట్లాడుతూ ప్రజాపాలన సేవా కేంద్రాలపై పలు సూచనలు చేశారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులు కష్టపడి పని చేయాలి

జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి



ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ,మార్చి 5: కొత్తగా ఉద్యోగంలో నియామకం అయిన వారు కష్టపడి పనిచేసి గుర్తింపు తీసుకురావాలని జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో కారుణ్య నియామకం కింద ముగ్గురు అభ్యర్థులకు ఆఫీస్ సబార్డినేట్‌గా ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కారుణ్య నియామకం కింద త్వరితగతిన పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎస్.ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై నేడు బీఆర్ఎస్ నిరసన

నల్లగొండ, మార్చి 5: ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఫీజును వసూలు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో బుధవారం ధర్నా నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే, నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కంచర్ల భూపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టర్ హరిచందన



మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలో ధరణి స్పెషల్ డ్రైవ్ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన, చిత్రంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం

మునుగోడు, మార్చి 5: ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకా రం ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ హరిచందన అన్నారు. మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ధరణి పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్ స్పెషల్ డ్రైవ్‌ను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ తప్పులకు ఆస్కారం లేకుండా ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. గడువులోగా పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. అనంతరం స్థానిక హైస్కూల్ లో ఉన్న ఐదు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు ఉండకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెం ట ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మునుగోడు తహసీల్దార్ నరేందర్, నాయబ్ తహసీల్దార్ ఎన్.నరేష్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ దీపక్, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్, మార్చి 5: యాసంగి ధాన్యం కొనుగోలుకు అవసరమైన కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. యాసంగిలో వీలైనన్ని ఎక్కువ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్, ఐకేపీ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలును పకడ్బందీగా నిర్వహించాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన తేమను కొలిచే, తూకం వేసే యంత్రాలు, టార్పాలీన్లు వంటి సౌకర్యాలను ముందే సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం 2023-24 యాసంగిలో గ్రేడ్-ఏ ధాన్యం రకానికి కనీస మద్దతు ధర రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183గా నిర్ణయించినట్టు తెలిపారు. యాసంగిలో సాగు విస్తీర్ణం, మార్కెట్‌కు వచ్చే అంచనా ధాన్యం వివరాలు సమర్పించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. సీజన్ ప్రారంభానికి ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలు మద్దతు ధర, ఇతర వివరాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలను రవాణాకు సులభంగా ఉండే చోట ఏర్పాటు చేయాలని, 5కిలోమీటర్ల దూరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఉండేలా చూడాలని కోరారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన ధాన్యం తూర్పారపట్టే ప్యాడీ క్లీనర్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనీసం 40 టార్పాలీన్లు ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా యాసంగి సీజన్ ప్రారంభానికి ముందే అవసరమైన గన్నీ బ్యాగులను సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు. రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు మిల్లుల జాబితాను ముందే సమర్పించాలని, అధికారిక స్థలాల్లో మాత్రమే ధాన్యాన్ని నిల్వ ఉంచేలా చూడాలని, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే గన్నీ బ్యాగులు వాపస్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలుకు ముందే తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు సమావేశం నిర్వహించాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి వి.వెంకటేశ్వర్లు, డీఆర్డీవో నాగిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్, లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి



మిర్యాలగూడ రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో

నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ, మార్చి 5: రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి బుధవారం 12గంటలకు ప్రారంభించనున్నారు. మూడు జిల్లాల్లోని 12 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం ప్రారంభించడంతో పాటు రైతులను, అధికారులను, శాస్త్రవేత్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడనున్నారు. ఇదిలా ఉండగా నల్లగొండ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం కానున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిచందన మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వీడియోకాన్ఫరెన్స్‌కు ఎంపిక చేసిన దేవరకొండ మండలం కొండభీమనపల్లి రైతువేదికలో ఏర్పాట్లను దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మీ మంగళవారం పరిశీలించారు. వీడియోకాన్ఫరెన్స్ ప్రారంభంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. మిర్యాలగూడ రైతుల వేదికలో ఏర్పాట్లను ఆర్డీవో బి. చెన్నయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతుసమస్యలపై చర్చించేందుకు, సలహాలు, సూచన లు ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ వీడియో కాన్ఫరెన్స్ విధానాన్ని ఏర్పాటు చేసిందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భవిష్యత్‌లో రైతులు పంటల సాగులో ఎదురయ్యే అనుభవాలను, పంటల మార్పిడి, సీజన్ వారీగా పంటల సాగు, నీటి యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ విధానాలపై సంబంధిత అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పొందవచ్చునని అన్నారు. రైతులకు కనిపించే విధంగా వేదికపై స్ర్కీన్ ఏర్పాటు, సౌండ్ సిస్టమ్, మౌత్‌ల పనితీరును ఆర్డీవో పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ పోరెడ్డి నాగమణి, ఏవోలు సరోజ, సైదా, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయంలో ఇద్దరు డీబార్

నల్లగొండ, మార్చి 5: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు డీబార్ చేశాయి. మిర్యాలగూడలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, దేవరకొండలోని బాలికల జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదుచేశారు. జిల్లాలో మంగళవారం గణితం,వృక్షశాస్త్రం, సివిక్స్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి. మొత్తం 14, 152 మంది విద్యార్థులకు 13,712మంది హాజరుకాగా, 440మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 12,616మందికి 12,272మంది హాజరు కాగా, 344 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,536మందికి 1,440మంది హాజరు కాగా, 96మంది గైర్హాజరయ్యారు.

శాస్త్రోక్తంగా మహాశివరాత్రి పర్వాలకు శ్రీకారం

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, మార్చి 5: హరిహరక్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో అనుబంధ ఆలయమైన పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అర్చకబృందం మంగళవారం శైవాగమ శాస్త్రరీతిలో మహాశివరాత్రి పర్వాలకు శ్రీకారం చుట్టింది. సకల విఘ్నాలకు అధిపతి విఘ్నేశ్వరుడికి తొలి పూజతో అర్చకులు, వేదపండితులు, రుత్వికులు మహాశివరాత్రి వేడుకలను సంప్రదాయరీతిలో ఆరంభించారు. ముందుగా శివాలయ ప్రధానాలయంలోని గర్భగుడిలో కొలువుదీరిన రామలింగేశ్వరస్వామిని ఆరాధించిన పూజారులు ఆవరణలో ఉదయం 10.30గంటలకు శుద్ధిపుణ్యాహవాచన పూజలు నిర్వహించారు. మంత్రించిన జలాలతో శివాలయం, ఆలయ పరిసరాలను శుద్ధి చేశారు. స్వామి, అమ్మవార్లకు రక్షసూత్రాలను ధరింపజేసిన పూజారులు నిర్వాహకులకు కంకణధారణ చేశారు. అనంతరం దేవస్థాన అధికారులు రుత్వికులకు, అర్చకస్వాములకు దీక్షవస్త్రాలను అందజేశారు. సర్వ విఘ్నాలను తొలగించి మహోత్సవాలు దిగ్విజయం చేసేందుకు విఘ్నాధిపతిని ప్రార్థిస్తూ చేపట్టే విశేష పర్వమే విఘ్నేశ్వర పూజ అని, పరమేశ్వరుడి అనుగ్రహంతో సకల లోకాలు సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ నిర్వహించే వేడుక స్వస్తి పుణ్యాహవాచనమని, మంత్రించిన జలంతో స్థల, ద్రవ్య, సమస్త వస్తువులను శుద్ధిచేయడమే శుద్ధి పుణ్యాహవాచనమని ఆచార్యులు వివరించారు. సాయంత్రం వేళ నమక, చమక, రుద్ర, మంత్ర పుష్ప పఠనాలతో అంకురారోపణ, సోమకుంభకలశ స్థాపన, సమస్త దేవతారాధన వైదిక పర్వాలు వైభవంగా కొనసాగాయి. ఈ ఆధ్యాత్మిక పర్వాలను దేవస్థాన ప్రధాన పురోహితుడు గౌరీభట్ల సత్యనారాయణశర్మ, శివాలయ ప్రధానార్చకుడు గౌరీభట్ల నరసింహ రామశర్మ, అర్చకబృందం నిర్వహించగా, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి దంపతులు, పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి గుడి

● అభిమానం చాటుకున్న వీరాభిమాని సంతోష్

● ఈ నెల 19న నల్లగొండ జిల్లా వనిపాకలలో భూమిపూజ



వనిపాకలలో సీఎంకు గుడి నిర్మాణం చేసే స్థలాన్ని చూపుతున్న మేడి సంతోష్

చిట్యాలరూరల్, మార్చి 5: తమకు నచ్చిన నాయకులపై ఏదో ఒక రకంగా అభిమానం చాటుకుంటుంటారు అభిమానులు. వారిని దేవుడిలా కొలుస్తుంటారు. అదే కోవకు చెందిన ఓ వీరాభిమాని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి గుడి కట్టించాలని నిర్ణయించుకున్నాడు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన మేడి సంతోష్ సీఎం రేవంత్‌రెడ్డికి వీరాభిమాని. రేవంత్‌రెడ్డి ఇతర పార్టీల్లో ఉన్నప్పటి నుంచీ ఆయనపై సంతోష్ ఎంతో అభిమానం పెంచుకున్నాడు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డి చేరడంతో ఆ అభిమానం మరింత పెరిగింది. రియల్ ఎస్టేట్ చేసే ఆయన తాను నివాసం ఉంటున్న ఇంటి ఎదుట సొంత స్థలంలో సీఎం రేవంత్‌రెడ్డికి గుడి కట్టాలని మంగళవారం నిర్ణయించుకున్నాడు. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఈ సందర్భంగా సంతోష్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అంటే తనకు చాలాకాలంగా ఎంతో అభిమానమన్నారు. కనిపించని దేవుడి కంటే కనిపించే దేవుడిలా భావిస్తూ ప్రజల కోరికలు తీర్చుతున్నారని కొనియాడారు. ప్రజల కష్టాలను తెలుసుకుని వాటిని తీర్చేందుకు శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతోనే ఆరు గ్యారెంటీల్లో ప్రమాణస్వీకారం చేపట్టగానే రెండింటిని అమలు చేశారని, ఈ మధ్యనే మరో రెండింటిని అమలు చేసి నాలుగు గ్యారెంటీలను ప్రజలకు కానుకగా ఇచ్చారన్నారు. రేవంత్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో ఆయన్ను దేవుడిలా కొలుస్తూ గుడిని నిర్మించనున్నానని అందుకు ఈ నెల 19వ తేదీన గుడి నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపాడు. సీఎం రేవంత్‌రెడ్డిపై తనకున్న అభిమానంతో ఆయన్ను దేవుడిలా కొలుస్తూ గుడిని నిర్మించేందుకు నిర్ణయించుకున్నానని, ఈ అవకాశం తనకే దక్కడం ఆనందంగా ఉందని సంతోష్ తెలిపాడు. సంతోష్ తండ్రి మేడి యాదయ్య కాంగ్రెస్ పార్టీ నాయకుడు. ఆయన్ను స్థానికంగా 'ఎమ్మెల్యే యాదయ్య' అని పిలుస్తుంటారు.

'మహా'జాతరకు సర్వంసిద్ధం

● రేపు సాయంత్రం నుంచి జాతర ప్రారంభం ● పూర్తయిన ఏర్పాట్లు ● ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ ప్రభలు
● ఎద్దుల పోటీలకు ముమ్మర ఏర్పాట్లు ● ఆకట్టుకోనున్న సాంఘిక, పౌరాణిక నాటకాలు



వేడుకలకు సిద్ధమైన శంభులింగేశ్వరస్వామి ఆలయం

మేళ్లచెర్వు, మార్చి 5: మహాశివరాత్రి సందర్భంగా మండలకేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత, స్వయంభు శంభులింగేశ్వరస్వామి వారి జాతర ఈ నెల 8వ తేదీ (గురువారం) సాయంత్రం నుంచి ప్రారంభమవుతుంది. గతేడాది ఈ జాతరకు సుమారు ఐదు లక్షల మంది హాజరు కాగా... ఈ సారి ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ల, ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి వసతి, ప్రత్యేక వైద్య శిబిరాలు, బారీ కేడ్లు, పార్కింగ్ స్థలాలు, క్రీడా ప్రాంగణాలు అన్ని పూర్తిచేసి, సుమారు 700 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

ఆలయ విశిష్టత

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ఈ ఆలయం అనేక విశేషాలతో కూడుకొని ఉన్నది. మహిమ గల దేవుడిగా, భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా కొలవబడే స్వామి వారు లింగం ఆకారంలో ఉన్నారు. శివలింగం పైన రెండు వేళ్ల పట్టేంత స్థలం నుంచి గంగాజలం నిత్యం వస్తుండడం, ఎన్నిసార్లు తోడినా నీరు వస్తుండడం విశేషం. ప్రతీ 12 సంవత్సరాలకు ఒకసారి లింగం ఆకారం ఒక అంగుళం చొప్పున పెరగటం మరో విశిష్టత. అత్యంత ప్రాచీన ఆలయంగా కాకతీయుల కాలంలో 1311లో ఈ ఆలయం నిర్మించినట్లు ఆలయ ప్రాంగణంలో ఉన్న శిలాశాసనంపై లిఖించి ఉంది. సంతానంలేని దంపతులు స్వామి వారి ఆలయంలో స్నానసారం దీక్ష చేస్తే సంతానం కలుగుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం. ప్రతీ మహాశివరాత్రి రోజున స్వామి వారికి ఇష్టకామేశ్వరి అమ్మవారికి అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించటం, జాతర చేయటం ఇక్కడ ఆనవాయితీ.

ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ ప్రభలు

మహా శివరాత్రి జాతరలో శివరాత్రి రోజున, ఆలయ ప్రాంగణంలో శివరాత్రికి ముందు రోజున గ్రామ కూడలిలలో నిర్మించే 100నుంచి 110 అడుగుల ఎత్తులో నిర్మించే విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఉమ్మడి రాష్ట్రంలో కోటప్పకొండ తర్వాత అంత ప్రాముఖ్యం ఈ జాతరకు ఉంది. ఈ ప్రభలను వాటి మీద ఏర్పాటుచేసే సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడానికి ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలతోపాటుగా ఆంధ్ర ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన ఎద్దుల పందేలు ఇక్కడ నిర్వహిస్తారు. ఎనిమిది విభాగాల్లో జరిగే ఈ పోటీల్లో 80 బహుమతులు ప్రదానం చేస్తారు. ఆలయ ప్రాంగణంలో జాతర సందర్భంగా ఇన్విటేషన్ టీంలతో ఏర్పాటుచేసే కబడ్డీ పోటీలు ఆకట్టుకునే విధంగా ఉంటాయి. జాతర ఐదు రోజులు రాత్రివేళల్లో సాంఘిక, పౌరాణిక నాటకాలతో పాటు ప్రత్యేక శిక్షణ తీసుకున్న కోలాటాలు నిర్వహిస్తుంటారు.



సిద్ధమైన ప్రభలు

అన్నదానానికి ఏర్పాట్లు

మహాశివరాత్రి జాతర ఐదు రోజులపాటు ఆలయ సమీపంలోనే టీటీడీ కల్యాణ మండపం ఆధ్వర్యంలో అన్నదానానికి ప్రభుత్వం తరఫున ఏర్పాట్లు చేస్తుండగా... దాతల సహకారంతో వీరబ్రహ్మ మఠం తరఫున దండా లింగయ్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కాగా... గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల ముందు మహాశివరాత్రి జాతరరావటంతో ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న వారు పోటాపోటీగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కాగా.. ఈసంవత్సరం దాతలు ఎవ్వరూ ముందుకు రాకపోవటంతో ప్రభుత్వం తరఫున ఏర్పాటుచేస్తున్నారు.

రెండేళ్లలో పూర్తి చేయడమే లక్ష్యం

● పునఃప్రారంభమైన ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి ఎత్తిపోతల పనులు ● పనులను తరచూ పర్యవేక్షిస్తున్న అధికారులు ● ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి రైతులు సహకరించాలి : ఎమ్మెల్యే బాలూనాయక్



గొట్టిముక్కల రిజర్వాయర్ పనులను పర్యవేక్షిస్తున్న డిండి ఎత్తిపోతల ఎస్ఈ వెంకటేశ్వరరావు, అధికారులు, గొట్టిముక్కల రిజర్వాయర్

దేవరకొండ, మార్చి 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, బడ్జెట్‌లో ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయించడంతో ప్రాజెక్టుల నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయి. గత ఆరు నెలలుగా నిధుల కొరత, కోర్టు కేసులు, వివిధ కారణాలతో నిలిచిపోయిన ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయి. రెండేళ్లలో ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ చెబుతున్నారు. అందుకుగాను అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహించి సమీక్షిస్తుండడంతో ప్రాజెక్టుల పనులు పునః ప్రారంభమయ్యాయి. శ్రీశైలం సొరంగమార్గం.. శ్రీశైలం నుంచి తవ్వకం పనులు ప్రారంభమైనట్లు అధికారులు తెలుపుతున్నారు. నల్లగొండ జిల్లాలోని మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, 500 గ్రామాలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టును ప్రారంభించారు. రూ.1925కోట్లతో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 2005లో శ్రీశైలం సొరంగమార్గాన్ని ప్రారంభించారు. కాగా పనుల్లో తీవ్ర జాప్యం కారణంగా అంచనా వ్యయం ఇప్పటికే రూ.4,618 కోట్లకు పెరిగింది. సొరంగమార్గం మొత్తం 43.93 కిలోమీటర్లు తవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 34.37 కిలోమీటర్లు పూర్తయింది. 9.559 కి.మీ.ల సొరంగం తవ్వితే ప్రాజెక్టు పూర్తవుతుంది. రూ.2500 కోట్లకు పైగా పనులు పూర్తయ్యాయి. 2026 జూన్ వరకు గడువు పొడిగించారు. టన్నెల్ బేరింగ్ మిషన్ మరమ్మతులకు గురికావడంతో జర్మనీ, అమెరికా దేశాల నుంచి పరికరాలను తెప్పించే పనిలో నిమగ్నమయ్యారు. మన్నెవారిపల్లి ఒకటో టన్నెల్ వద్ద పనులు నిలిచిపోగా శ్రీశైలం నుంచి సొరంగం తవ్వకం పనులను పునఃప్రారంభించినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలుపుతున్నారు.

కొనసాగుతున్న డిండి ఎత్తిపోతల పనులు

డిండి ఎత్తిపోతల పథకాన్ని 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపనచేసి రెండున్నరేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అందుకుగాను ప్రాజెక్టు వ్యయం రూ.6190కోట్లు కేటాయించారు. కాని భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో భూనిర్వాసితులు ప్రాజెక్టు పనులను అడ్డుకోవడంతో తరచూ పనులు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. దీంతోపాటు ప్రాజెక్టులకు అనుమతిలేదని, కోర్టులో కేసుతో పనులు కొంతకాలంగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు పనులు పునఃప్రారంభమయ్యాయి. డిండి ప్రాజెక్టు రెండేళ్లలో పూర్తిచేస్తామని మంత్రులు, అధికారులు చెబుతున్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో శివన్నగూడెం, చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి, గొట్టిముక్కల, సింగరాజుపల్లి, ఉల్పర, గోకారం, ఇర్విన్ రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. వీటిలో గొట్టిముక్కల, సింగరాజుపల్లి రిజర్వాయర్ల పనులు 95శాతం పూర్తయ్యాయి. చర్లగూడెం రిజర్వాయర్ పనులు 65శాతం పూర్తయ్యాయి. చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ల పనులు 35శాతం పూర్తయ్యాయి. మిగతా రిజర్వాయర్ల పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. గొట్టిముక్కల రిజర్వాయర్ పరిధిలో 200 ఎకరాలకు భూపరిహారం చెల్లించాల్సి ఉంది. అందులో 130 ఎకరాలవరకు ప్రభుత్వ భూమి ఉంది. గొట్టిముక్కల, పూతల్‌రాంతండా, లింగన్నబావి భూనిర్వాసితులకు చింతపల్లి వద్ద పునరావాసం కల్పించారు. వెంకేపల్లి తండా, చర్లగూడెం, చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి ముంపు ప్రజలకు పునరావాసం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో ముంపునకు గురవుతున్న ఎనిమిది గ్రామాల భూనిర్వాసితులకు పునరావాసం కల్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎస్ఎల్‌బీసీకి రూ.2వేల కోట్లు, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.800 కోట్లు కేటాయించి రెండున్నరేళ్లలో పూర్తిచేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. గొట్టిముక్కల రిజర్వాయర్ పరిధిలో కొనసాగుతున్న ప్రొటెక్షన్‌వాల్ (రక్షణగోడ), విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పనులు, జనరేటర్, కార్యాలయ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటేశ్వరరావు తెలిపారు. చర్లగూడెం, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ల పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇటీవల గొట్టిముక్కల రిజర్వాయర్ పనులను డిండి ఎత్తిపోతల ఎస్ఈ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు పర్యవేక్షించారు. దీంతో ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి.

పనులు కొనసాగుతున్నాయి

డిండి ఎత్తిపోతల రిజర్వాయర్ పనులు కొనసాగుతున్నాయి. భూనిర్వాసితులందరికీ పునరావాసం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రాజెక్టుల నిర్మాణానికి అందరు సహకరించాలి. ప్రభుత్వం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది.

వెంకటేశ్వరరావు, ఎస్ఈ

సాగునీరు అందించడమే లక్ష్యం



డిండి ఎత్తిపోతల, నక్కలగండి, శ్రీశైలం సొరంగ మార్గం ప్రాజెక్టులను పూర్తిచేసి నియోజకవర్గానికి సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు ప్రాజెక్టులపై ప్రత్యేకదృష్టి సారించారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహించి ముందుకెళుతున్నారు. ప్రాజెక్టుల నిర్మాణానికి రైతులు సహకరించాలి. రెండేళ్లలో ప్రాజెక్టులను పూర్తిచేసి సాగు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం.

నేనావత్ బాలూనాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

బాలికల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరపాలి



విద్యార్థినుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

కవాడిగూడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భువనగిరి హాస్టల్‌లో ఇటీవల ఇద్దరు బాలికల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని భవ్య, వైష్ణవి న్యాయపోరాట కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్‌వద్ద ధర్నా చేయడానికి ప్రయత్నించగా వారికి అనుమతిలేదంటూ దోమలగూడ పోలీసులు ధర్నాను అడ్డుకున్నారు. బాధితుల కుటుంబసభ్యులు లలిత, వివిధ ప్రజాసంఘాల నాయకురాళ్లు మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఈ ఘటనపై న్యాయవిచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ధర్నా చేయడానికి వచ్చారు. 11గంటల సమయంలో అక్కడకు చేరుకున్న పోలీసులు భవ్య, వైష్ణవి న్యాయపోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు ఎలాంటి అనుమతులులేవని తేల్చిచెప్పారు. దీంతో న్యాయపోరాట కమిటీ నేతలు, బాధితుల కుటుంబసభ్యులు ఖచ్చితంగా ధర్నాచేసి తీరుతామని, తమ పిల్లలది ఆత్మహత్యకాదని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని వారు ఆరోపించారు. తమకు న్యాయం జరిగేంతవరకు ఇక్కడినుంచి కదిలేదిలేదంటూ రోడ్డుపై నిరసన తెలిపారు. వెంటనే దోమలగూడ పోలీసులు వారికి సర్దిచెప్పి 'మీకు అన్యాయం జరిగితే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలి' అని సలహా ఇవ్వడంతో వారు అక్కడినుంచి వెళ్లారు. ఈ ధర్నాకుమద్దతు తెలియజేయడానికి వచ్చిన పీడీఎస్‌యూనేతలు సంధ్య, ఝాన్సీ, చైతన్య, మహిళా సంఘం నాయకురాళ్లు వి.జ్యోతి తదితరులు మాట్లాడుతూ వైష్ణవి, భవ్యల ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ చేసి వారి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలన్నారు.

ఎయిమ్స్‌లో రక్తహీనతపై పరిశోధన

● ఏప్రిల్‌లో పరిశోధనలు ప్రారంభం : డైరెక్టర్ వికాస్ భాటియా



బీబీనగర్ పరిధిలోని ఎయిమ్స్

బీబీనగర్, మార్చి5: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో రక్తహీనతపై పరిశోధనలు చేయనున్నారు. భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), ఆయుర్వేద సైన్స్ సహకారంతో అనేమియా(రక్తహీనత)పై బీబీనగర్ ఎయిమ్స్‌తోపాటు వార్ధ, జోద్‌పూర్, బెంగళూర్, రాంచీ, న్యూఢిల్లీ, భూపాల్‌లోనూ అధ్యయనం చేయనున్నట్లు ఆదివారం ఢిల్లీలో ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దేశంలో రక్తహీనత ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా మారిందని 2019-2021లో జాతీయ కుటుంబ సర్వేలో తేలింది. దాదాపు 57శాతం మంది 15నుంచి 49సంవత్సరాల వయసు గల మహిళలు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో భారత ప్రభుత్వం రక్తహీనత సమస్యను ప్రాధాన్య అంశంగా తీసుకుని పరిశోధనకు నిర్ణయించింది. బీబీనగర్ ఎయిమ్స్‌లో కమ్యూనిటీ మెడిసిన్, ఫ్యామిలీ మెడిసిన్ విభాగాల ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో సంబంధిత విభాగ అధిపతి ఆర్.గోమతి నాయకత్వంలో పరిశోధనలు ప్రారంభం కానున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా తెలిపారు.

ఆపరేటర్లకు అందని భత్యం



కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ(ఫైల్)

భువనగిరి టౌన్, మార్చి 5: కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఇప్పటివరకు నాలుగు పథకాలను ప్రభుత్వం అమలుచేసింది. ఇందుకోసం 28 డిసెంబరు 2023 నుంచి 6 జనవరి 2024 వరకు రాష్ట్రమంతటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలనలో ఆశావహులనుంచి దరఖాస్తులను స్వీకరించింది. స్వీకరించిన దరఖాస్తులను గత నెల 7 నుంచి 17 వరకు ప్రైవేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్లు ప్రజాపాలన తెలంగాణ పోర్టల్‌లో నమోదు చేశారు. వడపోతల అనంతరం ఎంపికైన అర్హులు పథకాల లబ్ధిని పొందుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్ చేసిన ప్రైవేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రభుత్వం ఇంతవరకు ఇస్తానన్న చార్జీలను మాత్రం ఇవ్వలేదు. దీంతో ఉమ్మడిజిల్లాలో ప్రజా పాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ఆపరేటర్లు ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతున్నారు. ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యే వరకూ వెంటే ఉంటూ ఒత్తిడి చేస్తూ పని చేయించుకున్న అధికారులు అనంతరం మొఖం చాటేస్తుండడం, తాము ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుల ఆధారంగానే ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి తన హామీలను నెరవేర్చుకుంటూ తమను విస్మరిస్తుండడం పట్ల ఆపరేటర్లు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 11,41,767 ప్రజాపాలన దరఖాస్తులను ఎంట్రీ చేసిన సుమారు 6వేల మంది ఆపరేటర్లకు రూ.57,08,835 చార్జీల రూపంలో అందాల్సి ఉంది.

ఒత్తిడితోనే పని పూర్తి

సుమారు వారం పని దినాల్లో ప్రతీ బస్తీ, ప్రతీ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో స్వీకరించిన అర్జీలను సంబంధిత ప్రభుత్వ సిబ్బందే ఎంట్రీ చేయాలని మొదటగా ఉన్నతాధికారులు నిబంధన విధించారు. కానీ పలువురికి కంప్యూటర్ అవగాహన కొరవడడం మరికొందరికి కంప్యూటర్లు లేకపోవడం మరికొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్య ఉండడంతో ప్రైవేట్ ఆపరేటర్లచే దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు ప్రతీ దరఖాస్తుకు రూ.15ఇస్తామని మొదటగా ప్రకటించారు. అనంతరం రూ.10తగ్గించి రూ.5మాత్రమే ఇస్తామన్నారు. అయినప్పటికీ ప్రైవేట్ ఆపరేటర్లు ప్రజాపాలనలో తాము భాగస్వాములు కావాలనే ఉత్సాహంతో దరఖాస్తులను ఎంట్రీచేశారు. ఎంట్రీ ప్రక్రియ కొనసాగినన్ని రోజులు అధికారులు ప్రతీ నిమిషం పర్యవేక్షిస్తూ టార్గెట్ పూర్తి చేయాలంటూ ఒత్తిడిచేస్తూ గడువులోపు ఎంట్రీలను పూర్తి చేయించారు. చివరి రోజు నాటికి చార్జీలను చెల్లిస్తామని ప్రతీరోజు పేర్కొనే వారు కానీ ఎంట్రీ ప్రక్రియ పూర్తయి సుమారు 50 రోజులు గడుస్తుండగా ప్రైవేట్ ఆపరేటర్ల ఎంట్రీల ఆధారంగానే అర్హులను ఎంపికచేసి అభయ హస్తం పథకాల లబ్ధిని కూడా ప్రభుత్వం అందిస్తున్నది. ప్రతీ పథకం ప్రారంభానికి ముందు పాలకులు, అధికారులు హంగామా చేస్తూ ఆపరేటర్లకు చెల్లించాల్సిన చార్జీలను మాత్రం విస్మరిస్తుండడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

యువతే అధికం

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ఆపరేటర్లలో యువతే అధికంగా ఉంది. ప్రభుత్వ కార్యాకలాపాల్లో విధులు నిర్వహించాలనే ఉత్సాహంతో పలువురు యువకులు సొంత కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల ద్వారా ఎంట్రీ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ రెండు లేని వారు తమకు తెలిసిన వారి వద్ద నుంచి తాత్కాలికంగా సర్దుబాటు చేసుకున్నారు. మరికొంత మంది గృహిణులు ఇంట్లో ఉంటూనే ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తిచేశారు. ఇంటర్నెట్ సౌకర్యంలేని వారు తాత్కాలికంగా సెల్‌ఫోన్లలో నెట్ బ్యాలెన్స్ రీచార్జ్ చేసుకోగా మరికొందరు వైఫై అందుబాటులో ఉన్న బంధువుల ఇళ్ల నుంచి కూడా దరఖాస్తులను ఎంట్రీచేశారు. ఒక్కో దరఖాస్తుకు సంబంధించి సుమారు 25 వివరాలను సుమారు 10 నిమిషాలపాటు ఎంట్రీ చేసినప్పటికీ వారికి రావాల్సిన స్వల్ప చార్జీలు కూడా నేటికీ అందలేదు.

ప్రజాపాలన దరఖాస్తులు ఇలా

జిల్లా	దరఖాస్తులు	ఆపరేట్లకు రావాల్సిన చార్జీలు
నల్లగొండ	6,11,853	రూ.30,59,265
సూర్యాపేట	3,11,107	రూ.15,55,535
భువనగిరి	2,18,507	రూ.10,94,035
మొత్తం	**11,41,767**	**రూ.57,08,835**

చార్జీలను వెంటనే చెల్లించాలి



ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ప్రైవేట్ ఆపరేటర్లకు వెంటనే చార్జీలను చెల్లించాలి. మామిత్ర బృందం సుమారు 600లకు పైగా దరఖాస్తులను ప్రజాపాలన తెలంగాణ పోర్టల్‌లో నమోదు చేశాం. చార్జీల రూపంలో వచ్చే మొత్తంతో చిన్నపాటి అవసరాలు తీరుతాయనుకున్నాం. కానీ ఇప్పటివరకు అధికారులు, ప్రభుత్వం చార్జీల చెల్లింపుపై మౌనం పాటిస్తుండడం ఆశ్చర్యంగా ఉంది. ఆపరేటర్లందరూ నిరుద్యోగులు, గృహిణులే అధికంగా ఉన్నారు. ఇప్పటికైనా చార్జీలను చెల్లించాలి.

జాలిగం శివప్రసాద్, ప్రైవేట్ ఆపరేటర్, భువనగిరి

నిధులు రాగానే చార్జీలు చెల్లిస్తాం



భూదాన్‌పోచంపల్లి మండలంలో 11,358 ప్రజాపాలన దరఖాస్తులను ఆపరేటర్లు ఎంట్రీ చేశారు. కానీ వారికివ్వాల్సిన చార్జీలను ప్రభుత్వం ఇంతవరకు విడుదల చేయలేదు. చార్జీల కోసం ఆపరేటర్లు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిధులను విడుదల చేసిన వెంటనే చార్జీలను చెల్లిస్తాం. దరఖాస్తులను ఆపరేటర్లు నిర్దేశిత గడువులోపు నమోదు చేయడంతోనే అర్హుల ఎంపిక సులువైంది.

రాపర్తి భాస్కర్, పోచంపల్లి ఎంపీడీవో.

'గృహజ్యోతి' దరఖాస్తుల సవరణకు అవకాశం

రామగిరి, మార్చి 5: ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోని ఎంపిక కాని వారి దరఖాస్తుల సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మంగళశారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి మునిసిపల్ కార్యాలయంతో పాటు పానగల్ రోడ్డులో గల ఎల్లమ్మ గుడి వద్ద ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల భవనం, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న గాంధీ పార్క్, శ్రీనగర్ పార్కు, అవుట్‌డోర్ స్టేడియం, మాన్యంబావి కమ్యూనిటీహాల్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కనకదుర్గ గుడి వద్ద ఉన్న కమ్యూనిటీ హాల్, రవీంద్రనగర్ పార్క్, చర్లపల్లిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

51 శాతం పీఆర్‌సీ వర్తింపజేయాలి

నార్కట్‌పల్లి, మార్చి 5: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 51 శాతం పీఆర్‌సీ వర్తింపజేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి కోరారు. పీఆర్‌సీ పెంపుపై ఉద్యోగ,


వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఉపాధ్యాయ రాష్ట్ర సంఘాల నాయకులు పీఆర్‌సీ చైర్మన్ శివశంకర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఏ, ఎస్‌జీటీల వేతన వ్యత్యాసాలను తగ్గించాలని, నగర, పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30,24,18 శాతం చొప్పున హెచ్‌ఆర్‌ఏ వర్తింప జేయాలని కోరారు. గురుకులాల్లో పనిచేస్తున్న వారికి 010పద్దు కింద వేతనాలు చెల్లించాలన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

చందంపేట, మార్చి 5: వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మండలం కంభాలపల్లిలో ముత్యాల సర్వయ్య కుమారుడు వెంకటేష్, తల్లి లక్ష్మమ్మ జ్ఞాపకార్థం మంగళ వారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకొని మందులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్, మాజీ సర్పంచ్‌లు గోసుల అనంతగిరి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ముప్పారం శివాలయ చైర్మన్‌గా మల్లప్ప



నిడమనూరు, మార్చి 5: మండలంలోని ముప్పారం పార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయం(శివాలయం) చైర్మన్‌గా సుంకి మల్లప్ప నియమితులయ్యారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సభ్యులుగా ఓర్సు అండాలు, కంచి రమాదేవి, ఆదిముళ్ల వెంకన్న, నర్సింగు లింగయ్యను నియమించారు. ఆలయ చైర్మన్ మల్లప్ప మాట్లాడుతూ ఆలయంలో శివరాత్రి సందర్భంగా స్వామివారి కల్యాణం ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు.

'మట్టి తరలించేవారిపై చర్యలు తీసుకోవాలి'

నార్కట్‌పల్లి, మార్చి 5: కాల్వల తవ్వకం ద్వారా వచ్చే మట్టితో చేస్తున్న వ్యాపా రాన్ని అడ్డుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేశ్ అధికా రులను డిమాండ్‌చేశారు. బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎడమ కాల్వ నిర్మాణం తవ్వకం ద్వారా వెలికితీసిన మట్టిని కాల్వ భద్రత కోసం ఇరువైపులా నిల్వ ఉంచాల్సి ఉండగా సంబంధిత కాంట్రాక్టర్ రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసే వెంచర్లకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. పారిశ్రామికవాడలోని ఓ కంపెనీకి చెందిన భూమిలో తవ్విన కాల్వ మట్టిని కొన్ని రోజులుగా వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదు చేసినా ప్రాజెక్టు, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు.

'మనఊరు-మనబడి' పనుల నాణ్యతపై ఫిర్యాదు

నార్కట్‌పల్లి, మార్చి 5: మండలంలోని అక్కెనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు- మన బడి పథకం కింద చేపట్టిన పనుల్లో నాణ్యతాలేమిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కొందరు గ్రామస్థులు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో చేసిన పనులను పూర్తిగా నాసిరకంగా చేశారని కొన్నింటిని అసంపూర్తిగా వదిలేశారని పేర్కొన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు నాసిరకంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ పనులపై పూర్తిస్థాయి పరిశీలన, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

అడవిదేవులపల్లి, మార్చి 5: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో నూరానాయక్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. వేసవికాలంలో ఎండలు విపరీతంగా ఉన్నందున పని ప్రదేశాల్లో తప్పకుండా తాగునీరు ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎఫ్‌ఏలు రాములమ్మ, చిన్న తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పెద్దవూర, మార్చి 5: సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏటీడీవో కె. లక్ష్మారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, ఎస్టీ హాస్టల్‌ను మంగళశారం తనిఖీ చేశారు. గిరి జన సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశానుసారం జీపీఎస్ ట్యాబ్‌బేస్డ్ అటెండెన్స్ చేపట్టినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలాజీనాయక్, వార్డెన్లు కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు రాంరెడ్డి, షబ్బీర్, కృష్ణ, శ్రీనునాయక్, సైదులు, శాంతి, షాహిద్‌బేగం, సంధ్య ఉన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 5: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని నంబాపురం, పెద్దగట్టు, నక్కలపెంటతండాలో సీసీరోడ్లకు మంగళవారం శంకుస్థాపన చేశారు. మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో అదనపు గదులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. గ్రామాల్లో తగిన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు ఉతకడానికి వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల ఎస్‌వో సరళ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆ పనులు ప్రారంభించాలని ఏఈని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అధికారులు సమస్యలు సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు అలుగుబెల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోడియానాయక్, పల్లె సత్యనారాయణ, తేరా సత్యంరెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంఈవో తరి రాములు, కస్తూర్బా పాఠశాల ఎస్‌వో సరళ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లిని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దు తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని మంత్రియతండా, చెన్నారం, గన్యనాయక్‌తండా, కేశ్యతండా, వర్ధమా


పెద్దఅడిశర్లపల్లి : అదనపు గదులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

నిగూడెం, చింతకుంట్ల, కొర్రతండా గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, ఎంపీపీ దూదిపాల రేఖరెడ్డి, జడ్పీటీసీ పసూ్నరి సరస్వతమ్మ, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, ఎం.ఏ.సిరాజ్‌ఖాన్, కైసర్‌ఖాన్, ఎంపీడీవో రాంరెడ్డి, ఈవో వీరబాబు, గంధం సురేష్, ఎంపీటీసీ రాజురాణి, కోట్ల జగదీశ్, నీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్): ప్రజలు ఆధ్యాత్మికతను అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రంగుండ్ల గ్రామంలో


తిరుమలగిరి(సాగర్): పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నూతనంగా నిర్మిస్తున్న శ్రీభగుడు శివాలయ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మంగళవారం హాజరయ్యారు. ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న శివ, గణపతి, లక్ష్మీనర్సింహ్మస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. లలిత దశ ఉపాసకుడు రాయప్రోలు శ్రీరాంశర్మ, ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో గ్రామస్థులచే శాస్త్రోత్తంగా యజ్ఞాది క్రతువులను నిర్వహించారు. అనంతరం విగ్రాలను గ్రామంలో వేడుకగా ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, మండల కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తలసాని చంద్రశేఖర్, ఆంగోతు బాలునాయక్, కోట్యానాయక్; బాబురావ్‌నాయక్, బాలునాయక్, శ్రీనునాయక్, సర్దార్‌నాయక్, కిషన్‌నాయక్, లచ్చునాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి

నల్లగొండ, మార్చి 5: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని క్రైస్తవులకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఏబీసీఎఫ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రేకల భద్రాద్రి కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో క్రైస్తవులు అంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో 16వేల మంది క్రైస్తవులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అండగా ఉండి ఓటు వేసి గెలిపించారన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ క్రైస్తవులకు రాష్ట్రంలో ఒక ఎమ్మెల్సీ, రాజ్యసభ, రెండు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తున్నారని, క్రైస్తవులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని, రాష్ట్రస్థాయిలో గ్రంథాలయ సంస్థ పరిషత్ చైర్మన్ పదవి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి

తనకు ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో మంత్రి వెంకట్‌రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కట్టా మోశయ్య, జాన్‌బాబు, మదుసూదన్, శేషయ్య, కె. యోవెల్, సామెల్, రమేష్, మిషక్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో నిమగ్నమవ్వాలి

మిర్యాలగూడ టౌన్, మార్చి 5: రీసోర్స్ పర్సన్లు ప్రజాసేవలో నిమగ్నమవ్వాలని మెప్మా పీడీ కరుణాకర్ అన్నారు. పట్టణంలోని సుందరయ్య పార్కులో మంగళవారం


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ కరుణాకర్

నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శ్రీనిధి రుణాల మంజూరు, రీపేమెంట్ అంశాల్లో పట్టణం వెనుకబడి ఉందన్నారు. సభ్యులు సమన్వయంతో పని చేసి సత్ఫలితాలు సాధించాలని కోరారు. ఆస్తి పన్ను వడ్డీపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై గృహయజమానులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో మెప్మా అధికారులు శివాజీ, బక్కయ్య, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, పార్వతి పాల్గొన్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం అంది స్తున్న పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సేవలందించేందుకు ప్రత్యేక అధికా రులను నియమించినట్లు మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ తెలిపారు. 12మంది అధికారులు వార్డుల వారీగా సేవలందిస్తారని ఆయన తెలిపారు.

ప్రభుత్వం కూలీబంధు పథకాన్ని ప్రవేశపెట్టాలి

కట్టంగూరు, మార్చి 5: ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు కూలీబంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య కోరారు. మండలంలోని ముత్యాలమ్మగూడెంలో మంగళవారం సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా పేదల బతుకులు మారడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్న వెంకులు, నాయకులు ఇటికాల సురేందర్, గాదనబోయిన కుమార్, అండాలు, మంజుల, జాల శ్రీను, మంగమ్మ తదితరులు ఉన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలం పిట్టంపల్లిలో మంగళవారం ఉపాధిహామీ కూలీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ శివారులో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీల వద్దకు సంఘం నాయకులు వెళ్లి సభ్యత్వాలు అందజేశారు. సంఘం మండల


కూలీలకు సభ్యత్వాలు అందజేస్తున్న నారీ అయిలయ్య

కార్యదర్శి మెట్టు పరమేష్ మాట్లాడుతూ కూలీలకు పని ప్రదేశంలో అన్ని వసతులను కల్పించాలని, బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలన్నారు. రోజుకు కూలీ రూ.600లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మల్లేష్, ఉడుగు సత్తయ్య, మెట్టు నర్సింహ, చంద్రయ్య ఉన్నారు.

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ల సస్పెన్షన్

నల్లగొండ, మార్చి 5: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ డీఈవో బొల్లారం భిక్షపతి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాకేంద్రంలోని డైట్ ప్రాథమిక పాఠశాల 4వ తరగతి విద్యార్థినుల పట్ల ఆ పాఠశాల హెచ్‌ఎం పోలా వెంకటయ్య, ఉపాధ్యాయుడు పి. శ్యాంసుందర్ అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణ వచ్చిన విషయం తెలిసిందే. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం జిల్లా విద్యాశాఖ శాఖ పరమైన చర్యలో భాగంగా ఆ ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు.

నీటిపారుదల శాఖ అటెండర్ ఆత్మహత్యాయత్నం

నల్లగొండ టౌన్, మార్చి 5: జిల్లా నీటిపారుదల శాఖలో అటెండర్‌గా పని చేస్తున్న హుస్సేన్ మంగళవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాథమిక విచారణ మేరకు హుస్సేన్‌కు అప్పులు ఎక్కువ కావడంతో జడ్పీలోని ఇరిగేషన్ కార్యాలయంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. 45శాతం కాలిన గాయాలు కావడంతో జిల్లాకేంద్ర ఆస్పత్రిలో చేర్పించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇరిగేషన్ శాఖ ఈఈ సురేందర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 5: కోదండపురం గ్రామంలో వెలిసిన పద్మావతీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహలను ఆలయం నుంచి తేరు వరకు పల్లకిలో ఊరేగించారు. అనంతరం స్వామివారు, అమ్మవారలను రథంపై ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, మేళతాలాలతో ఆలయం నుంచి పూరవీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి వారిరథాన్ని లాగి తన్మయత్వం చెందారు. తేరు ప్రాంగణ మంతా గోవిందా నామస్మరణతో మార్మోగింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. వేద పండితుడు శ్రీనివాసచార్యులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, పాలక మండలి సభ్యులు బొడ్డు ఎల్లి వెంకటరమణాచారి, పోచంరెడ్డి సైదిరెడ్డి, పోలే ఇందిరామహేందర్, నక్క బిక్షమయ్య, ఇంద్రకంటి లక్ష్మయ్య, బాలబోయిన వెంకటయ్య, అర్చకులు పొందూరి శ్రీనివాసచార్యులు, శ్రీరమణచార్యులు తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న వేదపండితులు

ట్రాక్టర్ దొంగ అరెస్ట్

దేవరకొండ, మార్చి 5: దేవరకొండ పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఫిబ్రవరి 18న మేడబోయిన అంజయ్యకు చెందిన ట్రాక్టర్‌ను అపహరించిన దొంగను పట్టుకొని అరెస్ట్ చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మడమడకు చెందిన మేడబోయిన అంజయ్య అనే రైతు దేవరకొండలో నివాసం ఉంటున్నాడు. తన ట్రాక్టర్‌ను దేవరకొండ మార్కెట్‌యార్డులో నిలిపివేసి ఇంటికి వెళ్లాడు. ఉదయానే వచ్చి చూడగా ట్రాక్టర్ కనిపించలేదు. ఫిబ్రవరి 18న ట్రాక్టర్ అపహరణకు గురైం దని దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. కాగా ట్రాక్టర్ హాలియా పట్టణ శివారులో ఉందని సమాచారం మేరకు దేవరకొండ పోలీసులు అక్కడికి వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ అపహరించిన దేవరకొండ మండలం షైనంపల్లికి చెందిన పులిజాల గణేష్‌ను అరెస్ట్‌చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపించినట్లు సీఐ పేర్కొన్నారు. కేసును చేధించిన కానిస్టేబుల్ తిరుపతయ్య, హోంగార్డు సింహద్రి, రాజరాం, శంకర్, యాదయ్యలను సీఐ అభినందించారు.

రేపటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

కనగల్, మార్చి 5: మండల కేంద్రంలోని బండి రామలింగేశ్వరస్వామి ఆలయ(శివాలయం) బ్రహ్మోత్సవాలు ఈనెల 7 నుంచి 11 నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు పి. శంకరశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న ఉదయం గణపతి పూజ, శైవశుద్ధి మహాపుణ్యావచనం 8న పంచామృత సహిత మహాన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం రాత్రి జాగారణ 9న ఎదుర్కోలు, శ్రీపార్వతిబండి రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం (తలంబ్రాలు) రాత్రి నంది వాహనసేవ, 10న తెల్లవారుజామున అగ్నిగుండాలు, 11న స్వామివారి దివ్యరథసేవ గ్రామోత్సవం నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

కట్టంగూరు, మార్చి 5: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చెరువు అన్నారం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన పొడిచేటి పాపయ్య అనే గీత కార్మికుడు రోజు మాదిరిగానే తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందప డడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను బంధువులు వెంటనే నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

మంచినీటి సమస్య లేకుండా చూడాలి

కట్టంగూరు, మార్చి 5: వేసవిలో గ్రామాల్లో మంచినీటి సమస్య రాకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ జెల్లా ముత్తిలింగం సూచించారు. కట్టంగూరులోని ఎంపీడీవో కార్యా లయంలో మంగళవారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా వేసవి కాలంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, సూపరింటెండెంట్ చితమల్ల చలపతి తదితరులు ఉన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మాడ్గులపల్లి, మార్చి 5: అనారోగ్య కారణాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని చిరుమర్తిలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మండల మల్లయ్య(58) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండేళ్ల క్రితం కడుపునొప్పి ఆపరేషన్, మూడు నెలల క్రితం హెర్నియాకు శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అయినప్పటికీ ఆరోగ్యం కుదుట పడకపోవడంతో తీవ్ర మనోవేదనకు షెడ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

75క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ, మార్చి 5: పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్న వారిపై దాడులు చేసి 75క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లి లచ్చిరెడ్డి, జిల్లా ట్రాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలంలోని మేళవాయి గ్రామం వద్ద ఉన్న మలికార్జున రైస్‌మిల్లు మంగళవారం తనిఖీ చేయడానికి వెళ్లిన జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం, నాంపల్లి పోలీసులు రైస్‌మిల్లుపై దాడి చేశారు. రైస్‌మిల్లు వద్ద ఉన్న అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటో, మహేంద్ర బోలేరా ట్రాలీలో 75క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం బస్తాలు అక్రమ రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. విచారించగా రైస్ మిల్లు యజమానికి సంబంధించిన బియ్యం అని, పలు గ్రామాల్లో కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. పీడీఎస్ బియ్యం సేకరించి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులు వీరమళ్ల మల్లికార్జున్(నాంపల్లి), వీరమళ్ల రమేష్(నాంపల్లి) వీరితో పాటు ఎండ్ల తిరుపతయ్య నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం, కొట్ర గ్రామం, అదే జిల్లాకు చెందిన నాయిని సంపతయ్య, చారకొండ మండలం, తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తులుగా గుర్తించినట్లు వారు తెలిపారు. 75 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పీడీయాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు.

మర్రిగూడ: క్రీడలతో విద్యార్థులకు ప్రయోజనాలు కలుగుతాయని బీఆర్‌ఎస్ నాంపల్లి మండల అధ్యక్షుడు గుమ్మడపు నర్సింహ్మారావు అన్నారు. నాంపల్లి మండలంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి కేజేఆర్ ఫౌండేషన్ తరఫున మండలంలోని 20 ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు క్రీడల సామాగ్రిని అందజేశారు.

కట్టంగూరు: ఆసరా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పావనగుండ్ల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాఘవచారి, మాజీ సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి, ఆ సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ గుండాల శ్రీను, నూకల చంద్రయ్య, బండారు గణేష్, నర్సింహ్మ, సాయికుమార్, మధు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

చిట్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని బీఆర్‌ఎస్ యువజ విభాగం మండల అధ్యక్షుడు తుమ్మల నాగరాజురెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని ఇప్పుడు డబ్బులు వసూలు చేయడం తగదన్నారు.

చింతపల్లి: మండలంలో ఉపాధిహామీ పథకం కింద 2022-23లో జరిగిన పనులకు ఈ నెల 7న సామాజిక తనిఖీ(ఓపెన్‌ఫోరం) నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుజాత, ఈజీఎస్ ఏపీవో శౌరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, ఉపాధిహామీ కూలీలు, ఈజీఎస్ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

శాలిగౌరారం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వడ్లకొండ పరమేష్‌గౌడ్ అన్నారు. శాలిగౌరారంలో గృహజ్యోతి పథకంలో లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లు రశీదులను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిత్తలూరి జీడికల్లు, కూతాటి సోమయ్య, బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: యోగాసనాలు చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని యోగా శిక్షకులు తిరుమలశెట్టి సుబ్బారావు గురూజీ అన్నారు. శాలిగౌరారంలో ప్రజలకు ధ్యానయోగా శిక్షణపై అవగాహన సదస్సు

సంక్షిప్త సమాచారం..

నిర్వహించారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానవుడు మానసికంగా, శారీరకంగా, అనేక సమస్యలతో సతమత అవుతున్న తరుణంలో ప్రతీ మనిషికి నిత్యం యోగ ఎంతో అవసరమన్నారు.

శాలిగౌరారం: నకిరేకల్ నుంచి ఉదయం 9గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు శాలిగౌరారం, బైరవునిబండ, అమ్మనబోలు మీదుగా మోత్కూర్ వరకు రెండు ట్రిప్పుల బస్ సౌకర్యం కలిపించినట్లు నల్లగొండ డిపో మేనేజర్ జి. రాంమోహన్‌రెడ్డి తెలిపారు.

చింతపల్లి: తహసీల్దార్‌గా విజయ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శంషొద్దీన్ హైదరాబాద్ సచివాలయానికి బదిలీకాగా, హైదరాబాద్ రూరల్ యూనిట్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న విజయ్‌కుమార్ చింతపల్లి తహసీల్దార్‌గా వచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

కొండమల్లేపల్లి: దేవరకొండ డివిజన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఎన్నికలను కొండమల్లేపల్లిలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించారు. టిఎస్ఎస్‌పిడిసిఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గాజుల శ్రీనివాసులు, కార్యదర్శిగా నేనావత్ సంతోష్, ఉపాధ్యక్షులుగా కోటిరెడ్డి సైదులు, వెంకటేశ్వర్లు, సంయుక్త కార్య దర్శులుగా రామలింగం, లక్పతి, పాండు, హనుమ, సైదులు, గంగాధర్‌రెడ్డి, ట్రెజరీగా రాజు, సభ్యులుగా హరీశ్, రమేశ్, మున్నా, ఇస్మాయిల్, లతీఫ్, అనిల్ ఎన్నికయ్యారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ పదవ తరగతి విద్యార్థులకు నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నేస్తం వ్యవస్థాపక అధ్యక్షుడు టీజీ లింగంగౌడ్, నాగచారి, జక్కుల రాజశేఖర్, బీ.రాజ్యలక్ష్మి, సిగ బన్నీ, లింగాల పూజ, దైద నాగరాజు, చరణ్, హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు సంధ్యారాణి, సుశీల ఉన్నారు.

మర్రిగూడ: మహిళలు సాధికారత పెంపొందించుకోవాలని మర్రిగూడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. మండలంలోని కుదాభక్షపల్లి గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ సాధికారతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ పార్వతీ, అంగన్‌వాడీ టీచర్ విజయ ఉన్నారు.

మర్రిగూడ: మండలంలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం మోడల్ పాఠశాల పరీక్షల కేంద్రంలో జరుగుతున్న పరీక్షలకు 428మంది కావాల్సి ఉండగా 50మంది పరీక్షలకు హాజరు కాలేదని, 378మంది మాత్రమే విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శివస్వరూపరాణి తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: ఎంజీయూ విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో పట్టణంలోని విజేత కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ్ తెలిపారు. కళాశాలలో విద్యనభ్యసించిన పలువురు విద్యార్థులు 10/10 గ్రేడ్లు సాధించారని తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: నిబంధనలు పాటించని నారాయణ, చైతన్య తదితర జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగయ్యగౌడ్ కోరారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు పదో తరగతి పరీక్షలు నిర్వహించక ముందే అడ్మిషన్లు తీసుకుంటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, అంజి, రాంబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

సందేశ్ఖాలీ ఘటన బాధాకరం

నల్లగొండ టౌన్, మార్చి 5 : పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సందేశ్ఖాలీ ఘటనలో నిందితులను ఉరితీయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నవీన్‌కుమార్, జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో మంగళవారం టీఎంసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పశ్చిమబెంగాల్‌లోని టీఎంసీ నాయకుడు షాజహాన్‌షేక్ అతని అనుచరులు అధికారాన్ని అడ్డు పెట్టుకొని సందేశ్‌ఖాళీ అనే గిరిజన తెగ ప్రాంతంలోని ప్రజలపై దాడులు, అక్రమ భూకబ్జాలు, మహిళలపై లైంగిక దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దయాకర్, అభినవ్, మురళి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: పశ్చిమబెంగాల్‌లో గిరిజన మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు వలమాల గోపిచంద్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అంకారి శ్రీకాంత్, హేమసుందర్, రేణుక, సంగీత తదితరులు పాల్గొన్నారు.